www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 మార్చి 2025

5

తిరుపతి



శక్తివిశిష్టాద్వైతంలో అంతర్జాతీయ విద్వత్ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో రెండు రోజులపాటు ఎన్ఎస్యు, అఖిల భారతీయ వీరశైవ శివాచార్య సంస్థానం, బెంగళూరు సంయుక్తాధ్వర్యంలో శక్తివిశిష్టాద్వైతంలో అంతర్జాతీయ విద్వత్సదస్సు వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా శ్రీశైలపీఠం డా.చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వాములు, కాశీపీఠం డా.మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వాములు విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విద్వత్తు సంగోష్టి నిర్వహణ ద్వారా శక్తివిశిష్టాద్వైతం మహత్యాన్ని ఆధునిక దార్శనికులకు అందించడం శుభపరిణామమని అన్నారు. వర్సిటీ విసి ఆచార్య జియస్ఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ అద్వైతవిభాగం ద్వారా దేశంలోని వివిధ పీఠాధీశులను పిలిచి వారిచే భారతీయ జ్ఞానాన్ని, భారతీయ సనాతన ధర్మాన్ని అందరికీ అందిచండం అత్యంత హర్షించదగ్గ విషయమని తెలిపారు.

టెం'ఢర్'



- నాయనా టెండర్లు తీసుకో..
- మాకు వద్దే వద్దు..
- పాత బిల్లులు ఇస్తే చాలు..
- కొత్త పనులు చేయలేం
- నగరపాలక సంస్థ పనులు చేసేందుకుముందుకు రాని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బాబు టెండర్లు వేసుకో, నాయనా టెండర్లు తీసుకో అంటూ అధికారులు కాంట్రాక్టర్లను బతిమాలుతున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనరల్ ఫండ్స్‌లో 30 పనులు గాను సుమారు రెండు కోట్లు విలువచేసే పనులకు టెండర్లను పిలవడం జరిగింది. ఇందులో రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్ లైన్, ఇతర చిన్న పనులు చేయాల్సిఉండా. అయితే కాంట్రాక్టర్లు చాలామంది కొత్తగా పనులు చేసేందుకు ఆసక్తి

కొత్త వారి కోసం వెతుకులాట

నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు కొత్తగా పిలిచిన 30 పనులు చేసేందుకు పాత కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో కొత్తగా కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల్ని ఇంజనీరింగ్ అధికారులు అన్వేషిస్తున్నారు. ఈ పనులు చేస్తే బిల్లులు సకాలంలో ఇస్తామని ఆశలు చూపిస్తున్నారు. కొత్త కాంట్రాక్టర్లు పనులు చేస్తే వారికి అనుభవం రావడమే కాకుండా కాంట్రాక్టరుగా గుర్తింపు కూడా వస్తుందని వారిని నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా బడ్జెట్‌కు విరుద్ధంగా పనులు చేయడం వల్ల బిల్లులు పేరుకుపోయాయి.

చూపడంలేదు. 30 పనులు గాను కనీసం 10 మంది మాత్రమే అది కూడా బలవంతంగా తీసుకోవడం జరిగింది. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా టెండర్లు పిలిస్తే పనులు చేశారు. ఇప్పటివరకు ఆ బిల్లులకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరుగలేదు. కొత్తగా మళ్లీ పనులు చేస్తే బిల్లులు వస్తాయో రాదోనన్న అనుమానంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లను బతిమాలుతున్నారు. కొంతమంది కాంట్రాక్టర్లయితే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం దరిదాపుకు కూడా రావడం లేదు. కొత్తగా పిలిచిన టెండర్ పనులు చేయకుంటే, గతంలో చేసిన పనులకు బిల్లులు ఆపుతామని ఎక్కడ తిరకాసు పెడతారోనన్న భయంతో కాంట్రాక్టర్లు కార్యాలయానికి రావడం మానేశారు. మరి కొంతమంది కాంట్రాక్టర్లు వడ్డీకి అప్పు తీసుకొచ్చి పనులు చేయలేమని, కార్పొరేషన్ తమకు అప్పుగా ఇస్తే పనులు చేస్తామని చెబుతున్నారు. ఈ సమస్య మున్సిపల్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు కమిషనర్ మౌర్య దృష్టికి తీసుకువెళ్లారు. ఎలాగైనా కాంట్రాక్టర్ల చేత పనులు చేయించేలా బుజ్జగించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆమె సూచించారు. ఇది గ్రహించిన కొంతమంది కాంట్రాక్టర్లు తమ ఫోన్లు కూడా స్విచాఫ్ చేసినట్టు సమాచారం. మరికొంతమంది తాము అప్పులు పాలైపోయినమని తమ దగ్గర డబ్బులు లేవని అంటున్నారు. ఏది ఏమైనా కొత్త పనులు చేసేందుకు తిరుపతి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

పాత బిల్లుల బకాయిలు రూ. 70 కోట్లు

వైసిపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల కాలంలో సుమారు నగరపాలక సంస్థ పరిధిలో 200 కోట్ల రూపాయల పనులు పిలిచారు. ప్రస్తుతం పాత కాంట్రాక్టర్లకు 70 కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు అడగని అధికారులు, అడగని రాజకీయ నేతలు లేరు. ఒక్క ముఖ్యమంత్రి తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల ద్వారా కూడా కాంట్రాక్టర్లు బిల్లులకోసం కమిషనర్‌పై ఒత్తిడి చేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఖజానా ఖాళీ కావడంతో కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో బిల్లులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. ఆస్తి పన్నులు ఇతర పన్నులు వసూలు చేసి కాంట్రాక్టర్లకు కొంత కొంత ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లపై యంత్రాంగం దృష్టి పెంచింది. పన్నులు వసూలుచేసి కార్పొరేషన్ ఖజానాను కొంతవరకైనా నింపేందుకు తిరుపతి నగర పాల సంస్థ కమిషనర్ మౌర్య ప్రయత్నాలు చేస్తున్నారు.

వేడుకగా కైలాస గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం (10వ రోజు) శివపార్వతుల గిరిప్రదక్షిణ వేడుకగా జరిగింది. గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గిరిప్రదక్షిణకు తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. రాజగోపురం నుండి చతుర్మాడవీధుల్లోకి శివపార్వతులు ఊరేగింపుగా ప్రవేశించారు. భేరివారి మండపం వద్ద భేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపచేశారు. అనంతరం జయరామరావువీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగ కాలనీ, కైలాసగిరి కాలనీ, రాజీవ్ నగర్ మీదుగా గిరి ప్రదక్షిణ జరిగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలో గల అంజూరు మండపం వద్ద స్వామి, అమ్మవార్లు కొంతసేపు విశ్రమించారు. అనంతరం అంజూరు మండపం నుంచి వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురు సేవా మండపానికి స్వామి, అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను ముక్కంటి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రేపు ధ్వజావరోహణం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంతో మహా శివరాత్రి ఉత్సవాలు దాదాపు ముగిసినట్లే. ధ్వజావరోహణం చేసే రాత్రిని దేవరాత్రిగా పిలుస్తారు. క్షీరసాగర మథనంలో అమృతం జనించాక దేవతలు శివ సాన్నిధ్యంలో ధ్వజావరోహణం చేసి, తమ నిజస్థానాలకు వెళతారు. ఇందులో భాగంగా ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో చప్పరాలపై ఊరేగించనున్నారు. ఇక రాత్రి స్వామి వారిని సింహాసనం పైనా, అమ్మవారిని కామధేనువు పైన పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ వేడుకల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ధాన్యం కొనుగోలు

రైతులను మోసం చేసే దళారీలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి- గూడూరు టౌన్: రైతుల నుంచి దళారులు, మిల్లరు యజమానులు ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రబీ సీజన్‌లో రైతులు ఎంతో పెట్టుబడి పెట్టి ధాన్యం పండిస్తున్నారని, ఎకరారకు సుమారుగా రూ.35వేలు పెట్టుబడి అవుతోందని తెలిపారు. ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తుంటే మధ్యలో దళారులు, మిల్లర యజమానులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలి చేసి రైతులకునష్టం కలిగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం క్వింటాకు రూ.19,750లు అందిస్తుంటే దళారులు రూ.17వేలు మాత్రమే ఇస్తూ దోచుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే రైతులను నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్

విచ్చలవిడిగా బెల్ట్ షాప్‌లు

- 24 గంటలూ అందుబాటులో మందు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ
- రోడ్లపై మందుబాబుల హల్‌చల్
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు



ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : పుత్తూరు మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. పుత్తూరు నారాయణవనం, వడమాలపేట మండలాల్లో బెల్ట్ షాప్ నిర్వహకులకు ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలు వర్తించవు. ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో వారు బెల్టు షాపు వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు జరపాలనే నిబంధనలున్నా, బెల్టు షాపుల పుణ్యమాని మందు బాబులకు 24 గంటలు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. అధికారులు, నాయకుల అండదండలతో ఈ బెల్టు షాపుల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందని స్థానికులు తెలుపుతున్నారు. ఎల్లప్పుడూ మందు అందుబాటులో ఉండటంతో మద్యానికి బానిసైనవారు ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. రోడ్లపై తప్పతాగి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మహిళలు, చిన్నారులు మందు బాబుల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. బెల్టు షాపులు అరికడితే కనీసం కొందరైనా మారతారని మందుబాబుల కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బెల్టు షాపు నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాసంఘాలు కోరుతున్నారు. చర్యలు తీసుకోని పక్షంలో సంబంధించిన శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

నరువి హాస్పిటల్లో అరుదైన శస్త్ర చికిత్స

8 గంటల పాటు శ్రమించిన వైద్యులు



నరువి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జివి సంపత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మురళి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాలోని నరువి హాస్పిటల్లో దేశంలోనే అరుదైన శస్త్ర చికిత్స చేసిన ఆసుపత్రిగా గుర్తింపు సాధించింది. 8 గంటల పాటు వైద్యుల బృందం ఈ శస్త్ర చికిత్సను చేసి విజయవంతం చేశారని ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ జివి సంపత్ తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పానికి చెందిన 55 ఏళ్ల మురళికి మెదడులో రక్త కణాలు చిట్లిపోయి, తల భాగం పూర్తిగా వాచిపోయి స్పృహ లేని పరిస్థితుల్లో నరువి హాస్పిటల్లో చికిత్స కోసం అడ్మిట్ అయ్యారన్నారు. ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని నరువి హాస్పిటల్ వైద్యబృందం నిశితంగా పరిశీలించింది. మెదడులో చిట్లిపోయిన నరాలకు శస్త్రచికిత్స చేయాలని వైద్యుల బృందం నిర్ణయించింది. న్యూరో సర్జన్ డాక్టర్ పాల్ హెన్రీ నాయకత్వంలో డాక్టర్ భూపేష్ పుగళేంది, డాక్టర్ శివకుమార్, కార్డియో సర్జన్ డాక్టర్ వినాయక్ శుక్ల, డాక్టర్రే జార్జి, అనస్తీషియన్ డాక్టర్ శరవణన్, డాక్టర్ రాజశేఖర్ బృందంగా ఏర్పడి సర్జరీ సమయంలో మెదడుకు వెళ్లే రక్తాన్ని శరీరంలోని హార్ట్-లంగ్ మెషీన్లకు మళ్లించారు. బ్లడ్ క్లాట్ కాకుండా దానికి తగిన ప్రత్యేకమైన మందులను వినియోగించామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం మురళి పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను 8 గంటల పాటు నిర్విరామంగా శ్రమించి రోగి ప్రాణాలు కాపాడినందుకు వైద్యుల బృందాన్ని జీవి సంపత్ అభినందించారు.

హిందూజా కళాశాలను

డీమ్డ్ విశ్వవిద్యాలయంగా మార్చే ప్రణాళిక



హిందూజా కళాశాల కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : హిందూజా కళాశాల ద్వారా విద్యలో 75 సంవత్సరాల జ్ఞాపకార్థం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు మరియు ప్రముఖులను ఉద్దేశించి భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ మాట్లాడుతూ, "సనాతన దేశ సంస్కృతి మరియు విద్యలో భాగం కావాలి ఎందుకంటే అది సమ్మిళితత్వాన్ని సూచిస్తుంది మరియు దానిలో బాగా స్థిరపడవలసిన లేదా పాతుకుపోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. హిందూజా ఫౌండేషన్ చైర్మన్ అశోక్ హిందూజా, "ఈ సంస్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంగా మారడానికి విద్యార్థుల సామర్థ్యాన్ని అనేక రెట్లు విస్తరించడానికి దీర్ఘకాలిక ప్రణాళికలతో పరిశ్రమ-విద్యా అంతరాలను తగ్గించడానికి తన నిబద్ధతను బలోపేతం చేస్తూ నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని స్థాపించనుంది. కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ మరియు వెల్త్ మేనేజ్‌మెంట్‌లో కొత్త ప్రోగ్రామ్‌లను, క్లైమేట్ ఫైనాన్స్ మరియు ఎగుమతి-దిగుమతి నిర్వహణలో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది."

నారాయణలో ఫేర్వెల్ సంబరాలు



ప్రతిభ చూపి విద్యార్థులకు సర్టిఫికేట్లు అందిస్తున్న నారాయణ స్కూల్ యాజమాన్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం టెక్నో స్కూల్లో ఆదివారం ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. 9, 10 తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. త్వరలో జరగనున్న పది పరీక్షలకు విద్యార్థులు మానసికంగా, ఆత్మస్థైర్యంతో సిద్ధం కావాలని ఏజీఎం శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆశలను అడియాశ చేసిన రాష్ట్ర బడ్జెట్


ప్రజాశక్తి - క్యాంపస్ : 2025 - 26 వార్షిక బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 10.64% మాత్రమే కేటాయించడం చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత ధ్యాస ఉందో అర్థమవుతోందని కామిరెడ్డి తరుణ్ వ్యాఖ్యానించారు. మొత్తం 3,22,359 కోట్లకు గాను విద్యాశాఖకు కేవలం 34,312 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం జీవో నం. 77 గురించి ఊసే లేకపోవడం అనేది పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేయడమే అన్నారు. విద్యారంగానికి ద్రోహం చేస్తే చూస్తూ ఊరుకోమని, ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిచ్చి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

హథీరాం బావాజీ మఠం ఆస్తులు భద్రమేనా..?

- మాజీ మఠాధిపతి అర్జున్ దాస్ లావాదేవీలపై విచారణ ఏదీ..?
- అధికార దుర్వినియోగం చేశారని ఆరోపణలు
- ప్రభుత్వ మారినా కానరాని చర్యలు భక్తులు సమర్పించిన
- బంగారు ఆభరణాలు భద్రమేనా?



మాజీ మఠాధిపతి అర్జున్ దాస్



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో శ్రీవారితో పాచికలాడి, గొప్ప ప్రాచుర్యం కలిగిన శ్రీస్వామి హథీరాం బావాజీ మఠం ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, అప్పటి మఠాధిపతి అర్జున్ దాస్ కోర్టు ద్వారా మఠం పాలనాపగ్గాలు చేపట్టారు. ఆయన అక్రమార్జనతో కోట్ల రూపాయలు వెనకేశాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాక ఆయన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ నడిచాయి. దీంతో గత వైసీపీ ప్రభుత్వం అర్జున్‌దాస్‌ను మఠాధిపతిగా తొలగించింది. ఆయన చేసిన అక్రమాలను గుర్తించి విచారణ చేయాలని మఠం ఫిట్ పర్సన్‌గా డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడును నియమించింది. రమేష్ నాయుడు పీఠాధిపతి అధికారిక నివాసాన్ని పరిశీలించి, అందులో ఉన్న వస్తువులను అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి మూత వేశారు. అయితే మఠాధిపతిగా కొనసాగిన అర్జున్ దాస్ తన హయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మఠం భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాక భక్తులు సమర్పించే బంగారు, వెండి ఆభరణాలు మాయమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. అన్యాక్రాంతమైన భూముల విషయంలో రమేష్ నాయుడు మఠం కఠినమైన చర్యలు తీసుకున్నారు. తన పదవీకాలం పూర్తి కాగానే తన మాతృశాఖ రెవెన్యూ శాఖకు వెళ్ళిపోయారు. అటు తర్వాత విజయవాడ కనక దుర్గమ్మ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ఎస్.రామారావును మఠం పరిపాలన అధికారిగా నియమించారు. ఆయన 2024 డిసెంబర్ నెలలో పదవీ విరమణ పొందడంతో శ్రీకాళహస్తి కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ బాపిరెడ్డిని పరిపాలన అధికారిగా నియమించారు.

తిరుమలలో దుకాణాల కేటాయింపుపై విమర్శలు

అర్జున్ దాస్‌పై మఠం ఆధీనంలో, తిరుమలలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం వద్ద దుకాణాలను కేటాయింపు చేసే విషయంలో అక్రమార్జన పొంది కేటాయింపులు చేశారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపితే అవీ బయటకు వచ్చే అవకాశం ఉంది.

బంగారు, వెండి ఆభరణాలు భద్రమేనా..?

అర్జున్ దాస్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భక్తులు సమర్పించిన బంగారు, వెండి కానుకలు ఎక్కడ ఉన్నాయి..? ఎంత ఉన్నాయి..? అసలు రికార్డుల ప్రకారం భద్రంగానే ఉన్నాయా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈవిషయాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత దేవాదాయశాఖ అధికారులపై ఉంది. అర్జున్ దాస్ మఠం పాలన వ్యవహారాలలో జరిపిన ఆర్థిక అవకతవకలపై విచారణలు జరిగి ఉంటే ఆ విషయాలను ఇప్పటివరకు ఎందుకు బహిర్గతం చేయడం లేదని పలువురు దేవాదాయశాఖ ఉన్నతాధికారుల తీరును తప్పపడుతున్నారు.

ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపితే మఠం భూములు, బావాజీకి భక్తులు సమర్పించిన కానుకలు భద్రంగా ఉండే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటారా,,? లేదా వేచి చూడాల్సిందే.

తుడ టవర్స్ రెసిడెన్షియల్ ఫ్లాట్స్ ఈ-వేలం



నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఈ నెల 8 నుండి 12 వరకు తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్స్ ఆన్ లైన్‌లో ఈ - వేలం ప్రక్రియ నిర్వహించ బడుతుందని తుడ వైస్ చైర్మన్ ఎన్.మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అన్నమయ్య సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు సమీపంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ 13 అంతస్తులతో 'తుడా టవర్స్' నిర్మాణాన్ని 3.60 ఎకరాల్లో, 8,28,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.345 కోట్ల అంచనా వ్యయంతో 2023 సంవత్సరంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో నిర్మాణం చేపట్టడం జరిగినదని తెలిపారు. ఇప్పటి వరకు 6 అంతస్తులలో నిర్మాణ పనులు పూర్తయి 7వ అంతస్తు నిర్మాణం పురోగతిలో ఉన్నదన్నారు. 2026 ఏప్రిల్ లోపు నార్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నిర్మాణంలో రెసిడెన్షియల్ ఫ్లాట్స్, వాణిజ్య, కార్యాలయాల అవసరాలకు కూడా నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇందులో బేస్మెంట్ పార్కింగ్ సదుపాయం కొరకు, గ్రౌండ్, మొదటి అంతస్తులో దాదాపు 1,20,000 చదరపు అడుగుల విస్తీర్ణములో వాణిజ్య సదుపాయం కొరకు, రెండవ అంతస్తు నుండి 5వ అంతస్తులో దాదాపు 90,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో వివిధ కార్యాలయాల సదుపాయాల కొరకు కేటాయించడం జరిగిందని తెలిపారు. అలాగే నివాస గృహాలకు సంబంధించి 2వ అంతస్తు నుండి 13 వ అంతస్తు వరకు 1235 చదరపు అడుగుల డబుల్ బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ - 46, అలాగే 1900 చదరపు అడుగుల ట్రిబుల్ బెడ్రూమ్స్ ఫ్లాట్స్ - 152, 3740 చదరపు అడుగుల నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ -32, మొత్తం 230 నివాస భవనాల నిర్మాణాలు జరుతున్నాయని తెలిపారు. నివాసితులకు స్విమ్మింగ్ పూల్, జిమ్, షటిల్ కోర్ట్, ల్యాండ్ స్కేపింగ్ పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్ మొదలగు ఆధునిక సౌక్యరములతో పాటు రెసిడెన్షియల్, వాణిజ్య భవనాలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ వసతిని కల్పించడం జరుగుతోందన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, నేషనల్ హైవే లకు చేరడానికి అత్యంత అనువుగా ఈ తుడా టవర్స్ ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలవారు ఈ - వేలంలో పాల్గొనవచ్చునని , మోడల్ ఫ్లాట్స్‌ను పరిశీలించవచ్చని తెలిపారు. వివరాలకోసం ఏపీ డాట్ ఇన్, తుడా టవర్స్ డాట్ ఇన్ వెబ్సైట్స్ పరిశీలించవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, అన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణయించిన కాలవ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేయటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తుడా విసి ఆ ప్రకటనలో తెలిపారు.

తడి- పొడి చెత్తపై అవగాహన



ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, చిందేపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ సి.పెంచలయ్య పర్యవేక్షణలో, పంచాయతీ కార్యదర్శి మునిశేఖర్ రెడ్డి తడి–పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికీ ప్లాస్టిక్ బుట్టలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పార్థసారథి రెడ్డి, మోహన్ రెడ్డి, సాయి రెడ్డి బాలసుబ్రమణ్యం , బిజెపి నాయకులు బాల గురునాథం,గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాయణం ప్రదర్శన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు రామాయణం ప్రదర్శించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ఉపవాచకం రామాయణం నుంచి ప్రశ్నలు అడుగుతారని, ఈ ప్రదర్శన వారికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి కృషి



అళగనాథ స్వామి ఆలయంలో నూతన నిర్మాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ అళఘనాథ స్వామి దేవస్థానంలో పాలకమండలి మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి దాతృత్వంతో 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన వాహనశాల, అర్చక నివాసం, వంటశాలను ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో శశాంక్, బొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, ముని గిరీష్, దశరధరామిరెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రవీందర్ రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేటలోని జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా క్లబ్ జోనల్ సెక్రెటరీ ధనుంజయ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చోళవరం గిరిబాబు, రొటీరియన్స్ సనత్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, సిద్ధారెడ్డి, హరినాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అంజనీ, తదితరులు పాల్గొన్నారు.


అర్హులకు ఆరోగ్య బీమా



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : అర్హులైనవారికి 25 లక్షల రూపాయలు ఆరోగ్య బీమా సౌకర్యం ముఖ్యమంత్రి ఏర్పాటు చేశాడని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఆదివారం దొరవారి సత్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఆమె భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, ఆసుపత్రుల్లో సౌకర్యాల అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. మాజీ ఎంపీ నెలల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ల్యాబ్ సదుపాయం ఏర్పాటు కానుండడంతో గ్రామీణ రోగులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడే చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వేమసాని శ్రీనివాస్ నాయుడు, సూళ్లూరుపేట శివాలయం చైర్మన్ శ్రీహరి రెడ్డి, మండల ఉప అధ్యక్షులు గోపాల్ రెడ్డి, బిజెపి తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ దయాకర్ రెడ్డి, పెళ్లకూరు మండల పార్టీ కన్వీనర్ సంచి కృష్ణయ్య, పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ చంద్రకళ, మైనారిటీ సెల్ నాయకుడు షబ్బీర్, మాజీ ఎంపిటీసీ ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, తెలుగుదేశం లీడర్ ఆదిముని, మాజీ మండల అధ్యక్షుడు రత్నయ్య, యన్ శేఖర్, పిఆర్‌డి రమణ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధికి అడ్డుకుంటే చర్యలు తీసుకోండి



రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరుతున్న గ్రామస్థులు

ప్రజాశక్తి - ఓజిలి : సిమెంట్ రహదారి ఏర్పాటుకు అడ్డుపడుతూ, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అరుంధతివాడి ప్రజలు అధికారులకు విన్నవించుకుంటున్నారు. మండల పరిధిలోని పెద్దపరియ అరుంధతి వాడలోని మాతమ్మ దేవస్థానం పక్కన ఉన్న రహదారికి సిమెంట్ రోడ్డు మంజూరు అయిందని, ఆ రహదారి నిర్మాణ పనులను చెయ్యనీకుండా పరిసర ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తి ఆటంకం కలిగిస్తున్నారని వారు తెలిపారు. అరుంధతివాడకు చెందిన ప్రజలు మాట్లాడుతూ శ్మశానానికి దారి లేకుండా రహదారిని ఒకరు ఆక్రమించుకొని ఆటంకం కలిగిస్తున్నారని పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మంజూరైన సిమెంట్ రహదారిని కూడా ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. అధికారులు స్పందించి సిమెంట్ రహదారి ఏర్పాటు చేసి అభివృద్ధికి సహకరించాలని అధికారులను అరుంధతి వాడ ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



తిరుమల సుధాకర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం ఎస్. వి. పురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త తిరుమల సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న నగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం ఎస్. వి పురంలో జరిగిన కర్మక్రియలకు హాజరై నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు ధనుంజయులు నాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇలాగైతే రోగాలు రావా?



పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మురుగు నీరు

- దోమ కాటుకు బెంబేలెత్తుతున్న కాలనీవాసులు
- పారిశుధ్య లోపం
- పట్టించుకోని మున్సిపల్ శాఖ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చెత్తతో నిండిపోయిన కాలువ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ ప్రవేశపెట్టి ప్రజలకు ఎలాంటి పారిశుధ్య లోపం లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని, ఆదేశాలు జారీ చేస్తున్నా, పుత్తూరు, జండా మాను వీధి, మద్ది రోడ్డు, మసీదు వెనుక భాగంలో డ్రైనేజీ కాలువ మురికి నీరు, చెత్త చెదారా లతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ శాఖ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగుతో దోమలు చేరి డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. పన్ను కట్టించుకోవ డానికి ముందుకొస్తున్న మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్య నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం చూపుతు న్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రపరచాలని, లేని పక్షంలో వార్డు ప్రజలందరూ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

> 16 వ వార్డు నుంచి వచ్చిన మురుగు నీరు, చెత్త మేము నివసించే 15 వార్డు లోకి చేరుతోంది. మున్సిపల్ అధికారు లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. శాశ్వత పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి.
>
> - శ్రీనివాసరాజు, 15వ వార్డు

సిద్ధార్థ కళాశాలకు అటానమస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల అధినేత ఆనంద్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ గొల్లపల్లి, సిద్ధార్థ ఇంజనీరింగ్ అండ్ ఎంబిఎ కళాశాలకు అటానమస్ స్టేటస్ లభించినట్లు ఆ కళాశాల అధినేత ఆనంద్ రెడ్డి తెలిపారు. స్థానిక బైరాగిపట్టేడలోని రిమ్స్ కళాశాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటానమస్ స్టేటస్ ద్వారా తమ బాధ్యత పెరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఆ కళాశాల చైర్మన్ కొండారెడ్డి, వైస్ చైర్మన్ విజయ్ రెడ్డి, ప్రిన్సిపల్ రాజశేఖర్, అధ్యాపకులుపాల్గొన్నారు.

'చెఫ్స్ పోట్' ప్రారంభం



చెఫ్స్ పోట్‌ను ప్రారంభిస్తున్న జెబి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ మునికృష్ణ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన చెఫ్స్ పోట్‌ను టీడీపీ నాయకులు జెబి శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. స్థానిక కేటీ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆ హోటల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ హోటల్లో అన్ని రకాల నాన్‌వెజ్ పదార్థాలు అందుబాటులో ఉంటాయన్నారు. హోటల్ అధినేత శశికుమార్ మాట్లాడుతూ తమ హోటల్లో అన్ని ఆన్లైన్ ఆర్డర్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కడియాల రమణ, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నాయకులు మహేష్, కె.మాధవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వియూలో అనుమతి లేని డ్రోన్..?
పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు



యూనివర్శిటీలో వాచ్‌మెన్‌తో వాగ్వాదం చేస్తున్న వ్యక్తి, మహిళ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా బయట వ్యక్తులు అడ్డదిడ్డంగా ఫోటోషూట్లు, సినిమా షూటింగులు, షార్ట్‌ఫిల్మ్ షూటింగ్లతో వర్సిటీ ప్రతిష్టను నానాటికి దెబ్బతీస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం, ఆదివారాల్లో బయట వ్యక్తుల తాకిడి వర్సిటీలో ఎక్కువగా ఉంటుందని వర్సిటీ వాచ్మెన్ తెలిపారు. గత రెండు, మూడు సంవత్సరాలకు పైగా వర్సిటీలో వాచ్మెన్ సిబ్బంది కొంతమందికి రిటైర్డ్ అయ్యారని, మరి కొంతమంది ప్రమోషన్లు వచ్చి వెళ్లిపోయారని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. బయట వ్యక్తులు శనివారం డ్రోన్ ఉపయోగిస్తుండగా వర్సిటీ హాల్లో జడ్జీల సమావేశానికి సంబంధించి వీడియో తీస్తున్నారే అనుమానంతో కోర్టు సిబ్బంది అడుగుగా మీరు ఎవరు మమ్మల్ని అడిగేందుకని వారిని బెదిరించారు. అక్కడే ఉన్న వర్సిటీ వాచ్మెన్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వర్సిటీలో డ్రోన్ వినియోగం నిషేధమని తెలుపగా ఆయనతో కూడా వాగ్వాదం చేశారు. వాచ్మెన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామనగానే డ్రోన్ వినియోగించిన వక్తి, మహిళ చల్లగా జారుకున్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు వర్సిటీలోకి బయట వ్యక్తులు రాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

విశ్రాంత జిల్లా వైద్య శాఖాధికారి మృతి

ప్రజాశక్తి -నాయుడుపేట: జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కెవి రమణయ్య ఆదివారం మృతి చెందారు. నాయుడుపేట మండల బీరదవాడకు చెందిన డాక్టర్ కేవి రమణయ్య అనారోగ్యంతో మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నాయుడుపేటలో ఈఎన్‌టి డాక్టరుగా ప్రసిద్ధి చెందారు. నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా ఉద్యోగ విమరణ చేసి కొంతకాలం ఒక ప్రైవేట్ క్లినిక్ ద్వారా ప్రజలకు సేవలందించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి -నాగలాపురం: సాయిబాబా ఆలయంలో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణాగల్లా, అరవింద్ నేత్రాలయ సిబ్బంది దిలీప్, సాయిబాబా ఆలయ నిర్వాహకులు జగదీష్ రెడ్డి, కన్నెప్ప మొదలియార్, సుగుణ రాముడు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అధ్వానంగా వ్యవసాయ కళాశాల అండర్ బ్రిడ్జ్ రోడ్డు



కంకర తేలిన రోడ్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జి రోడ్డు సంవత్సరం తిరగక ముందే సిమెంట్ రోడ్డు రాళు తేలిపోయి కంకర బయటపడింది. వర్షాకాలంలో ఈ రోడ్డు వర్షపు నీటితో నిలిచి అధ్వాన్నంగా తయారైంది. వ్యవసాయ కళాశాలలో చదివే విద్యార్థులకు, విద్యార్థినిల వసతి గృహానికి దారి ఈ అండర్ బ్రిడ్జి ద్వారానే వెళ్ళవలసి ఉంటుంది. ఈ రోడ్డులో నడిచేందుకు వారు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కళాశాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అయితే ఈ రోడ్డు నిర్మించిన సదరు కాంట్రాక్టర్ బిల్లు కోసం తూతూ మంత్రంగా పనులు చేసి అధికారులకు కమిషన్ల ఇచ్చి కాలం గడిపేశాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ అండర్ బ్రిడ్జి రోడ్డులో కంకర తేలిన రహదారిని సరిచేయాలని కోరుకుంటున్నారు.


నా బిడ్డను కాపాడండి



చికిత్స పొందుతున్న చిరంజీవి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ పరిధిలో కేఎం అగ్రహారం, అంగన్వాడి కేంద్రంలో టీచర్‌గా పని చేసే అంబిక తనయుడు చిరంజీవి (27) జనవరి నెల 17వ తేదీన నిద్ర మత్తులో మంచంపై నుండి నేలపై పడడంతో మెదడులోని నరం కట్ అయ్యి రక్త సరఫరా ఆగి గడ్డకట్టింది. వెంటనే అతన్ని తిరుపతిలోని ఓ ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే వైద్యానికి సుమారుగా 20 లక్షలు ఖర్చయిందని అంబిక ఆవేదన చెందిరు. అయితే వైద్యులు చిరంజీవికి మరో ఆపరేషన్ చేయాలని చెప్పడంతో వైద్య ఖర్చులకోసం సహాయం ఆశిస్తున్నారు. ఉన్న ఇంటిని కూడా అమ్ముకుని వైద్యం కోసం ఖర్చు చేశామని తెలిపారు. తన ఫోన్ నంబరు 9505572736, ఫోన్ పే నెం 9908165911 అని, సహాయం అర్థించారు.

ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహన మెకానిక్‌లు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ద్విచక్ర వాహన మరమ్మతుల నిపుణులు సూచించారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్ సమావేశ మందిరంలో చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన మెకానిక్‌లకు, పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో శిక్షణ పొందిన మోటార్ మెకానిక్ కోర్సు విద్యార్థులకు కొత్తగా వస్తున్న బీఎస్ – 6 ద్విచక్ర వాహనాల మరమ్మతులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ క్రమంలో బిఎస్ 6 వాహన మరమ్మతుల నిపుణులు సమ్మర్ ద్విచక్ర వాహనాలను రిపేర్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగాను చేస్తూ, ఎల్సీడీ ప్రొజెక్టర్ ద్వారాను ప్రయోగాత్మకంగా వివరించారు. చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మురుగేషన్, బాలచంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ప్రవేశిస్తున్న బిఎస్ – 6 వాహనాల మరమ్మతులపై ప్రత్యేక నిపుణుల చేత ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సంబంధిత అవగాహన సదస్సు తమ లాంటి మెకానిక్ లకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టి మెకానిక్‌లలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అవగాహన సదస్సులో పాల్గొన్న ఐటిఐ విద్యార్థులకు, ద్విచక్ర వాహన మెకానిక్స్‌కు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ద్విచక్ర వాహన మరమ్మతుల నిపుణులు బెంగళూరుకు చెందిన భాస్కర్ నాయుడు, వైజాగ్ చెందిన పవన్, కాకినాడకు చెందిన రాము, చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, కోశాధికారి షణ్ముగరెడ్డి, జాయింట్ సెక్రటరీ మస్తాన్, గౌరవాధ్యక్షులు కుమరేషన్ మురగ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - బాలయపల్లి : జయంపులో కిడ్నీ, కీళ్ల వ్యాది .గ్రస్తులకు చెన్నై నుండి వచ్చిన డాక్టర్ వినోద్ కుమార్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీ సుధాల పర్యవేక్షణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం జయంపు గ్రామస్తులు నరేంద్ర, గురునాథంల ఆధ్వర్యంలో జరిగింది. గ్రామస్తులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి హాజరాయ్యారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో మొదటిసారి రూ.3,22,359 కోట్లతో కూడిన భారీ బడ్జెట్ అభివృద్ధికి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ రూపొందించిన బడ్జెట్ అని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి షణ్ముగం తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు చరిత్రలో ఎన్నడు లేని విధంగా కేటాయింపులు చేశారని, ఉమ్మడి ఏపీలోనూ ఇంత పెద్ద మొత్తంలో బీసీ వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు ఎప్పుడు చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవులకు బీసీ సంక్షేమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

పల్లె పండుగతో గ్రామాలలో అభివృద్ధి పనుల జోరు

- ఆర్ సి పురం మండలంలో 26 పనులకు 6.13 లక్షలు మంజూరు
- స్పీడ్ అందుకున్న గుండోడు కణం రోడ్డు నిర్మాణం పనులు







ప్రజాశక్తి - రామచంద్రపురం: రాష్ట్రంలో గ్రామీణ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తోంది. చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రపురం మండలంలో గత అక్టోబర్ 22వ తారీఖున పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 26 పనులకు గాను శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) రూ. 6.13 లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేయించారు. పనుల ప్రారంభోత్సవానికి శంకుస్థాపనలు కూడా చేశారు. దీంతో మండలంలోని అనుపల్లి, బొప్పరాజు పల్లి, నెత్తకుప్పం, సి. రామాపురం గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. తాటిమాకుల కండ్రిగ సమీపంలో గుండోడు కణం రోడ్డు నిర్మాణం సర్వే వేగంగా సాగుతోంది. పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలలో ప్రధానమైన సమస్యలకు శాశ్వత పరిష్కారంగా గ్రామాల అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణతో నాణ్యతతో పనులు చేపడుతున్నారు. మండలంలో వెంకట రామాపురం, రాయల చెరువు గ్రామాలలో స్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయి. కానీ స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మించాలని స్థానికులు అడుగగా ఇంజనీరింగ్ అధికారులు అంగీకరించక పనులు పెండింగ్ పడ్డాయి. అలాగే పరమాల, కమ్మపల్లి గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది. పల్లెపండుగ పనులను మార్చి 15లోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఇంజనీరింగ్ అధికారులు ఆదేశిస్తున్నారు. ఆ రెండు గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళ్తాయని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. దీనిపై స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ స్పందించి నిర్మాణాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరారు.

క్రైం న్యూస్

కారు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు ..చెన్నూరు కాపు వీధికి చెందిన అల్లూరు మురళీ రెడ్డి, శ్రీకిరెడ్డి రమణరెడ్డిలు ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. వారిని గూడూరు వైపు వెళుతున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో అల్లూరు మురళీ రెడ్డి (58) మృతి చెందాడు. శ్రీకిరెడ్డి రమణరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. మురళీ రెడ్డి మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య, కుమార్తె వున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై దాడి



గాయల పాలైన డ్రైవర్ మణి

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) : ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన చంద్రగిరి మండలం, నడింపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతి –పాకాల మధ్య నడిచే పల్లె వెలుగు బస్సును డ్రైవర్ మణి(57) పాకాల నుంచి తిరుపతికి, పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో సర్వీస్ రోడ్డుపై వస్తూ ఉండగా ముంగిలి పట్టు వద్ద బస్సు ఆవుకు తగిలిందని స్థానికులు కొంతమంది బస్సును వెంబడించారు. నడింపల్లి వద్ద బస్సును ఆపి డ్రైవర్ మణిపై దాడి చేసారు. ఈ దాడిలో డ్రైవర్ మణి తలకు గాయం అయింది. బస్సులోని వారు 108 కి ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మణిపై దాడి చేసిన ముంగిలిపట్టు గ్రామానికి చెందిన సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

ఘనంగా హల్లో కిడ్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో హల్లో కిడ్స్ చిత్తూరు బ్రాంచ్ నాల్గవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చుడ చైర్‌పర్సన్ కటారి హేమలత, విశిష్ట అతిథులుగా హైకోర్టు న్యాయవాది త్రిమూర్తి, యాక్సిస్ బ్యాంక్ చిత్తూరు బ్రాంచ్ సీనియర్ మేనేజర్ శేఖర్ గుప్త హాజరయ్యారు. హల్లో కిడ్స్ యాజమాన్యం వీరిని సాదరంగా ఆహ్వానించి వారిచేత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE OF TIRUPATI
I.A.No.. 542 / 2024, O.S.No. 09 / 2024
N.Nagaarpitha ...Petitioner/Plaintiff
V/s
B.Lavanya & 4 others ...Respondents/Defendants
Summons to Respondents/Defendants No.2, 3 & 4
R2) B.Baaswanth, S/o late B.Sreedhar Babu,
R3) B.Preethi, D/o Late B.Sreedhar Babu
R4) B.Mahesh S/o late B.Sreedhar Babu,
All are residing at D.No.10-387, G.M.Street, Renigunta Post & Mandal, Tirupati District.
Please take notice that the petitioner/plaintiff filed the above petition for temporary injunction and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **12-03-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 12-03-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate for Claim petitioner, Tirupati
Cell: 9701185012

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE OF TIRUPATI
O.S.No. 09 / 2024
N.Nagaarpitha ...Plaintiff
V/s
B.Lavanya & 4 others ...Defendants
Summons to Defendants No.2, 3 & 4
D2) B.Baaswanth, S/o late B.Sreedhar Babu,
D3) B.Preethi, D/o Late B.Sreedhar Babu
D4) B.Mahesh S/o late B.Sreedhar Babu,
All are residing at D.No.10-387, G.M.Street, Renigunta Post & Mandal, Tirupati District.
Please take notice that the plaintiff filed the above suit for partition and the matter is posted for your appearance before the above said Hon'ble Court on 12-03-2025 at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 12-03-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate for Claim petitioner, Tirupati
Cell: 9701185012

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GUDUR
I.P No 16 / 2024
Kalimbakam.Pratap Babu ....Petitioner
V.S
1.Varre.Satyamani
2.Varre Jahnavi Lakshmi Being minor rep by her mother Varre.Satyamani
3.Thumma.Murugaiah ....Respondents
GENERAL NOTICE
Whereas the petitioner filed the above I.P No 16/2024 against the respondents for declare the respondents No 1 and 2 as insolvent and consequently set-aside the sale deed dt 20-3-2024 executed by them in favour of the respondent No 3 in respect of the petition schedule property for realization of the amount due to the petitioner under the promissory note dt 10-4-2022 along with subsequent interest executed by one Varre.Veera Venkata Nagaeswara Rao in his favour. Therefore above said I.P is posted for 7-3-2025 for calling objection from general public. Therefore if anybody is having objections, you are hereby attended before the Hon'ble court on 7-3-2025 at 10-30 A.M before the above said Hon'ble court either personally or through pleader and file objections. If any body will not come forward and file objection, the matter will be decided by presuming that there is no objections from general public.
S. Gangi Reddy, M.A,B.L
Advocate for the petitioner